

కథ

వేమన

చెట్టుకింద నాలుగు అధునాతనమైన కార్లు ఆగాయి. అందులో సూటుబూటులతో దిగిన మనుషులను చూసి ఒక్కసారిగా అదిరిపోయింది చెట్టు. ఏదో ఆపద రానున్నదని మధన పడసాగింది. అనుకున్నట్టుగానే అందులో ఒకడు తన చేతిలో చుట్టబడి ఉన్న కాగితాన్ని మడతవిప్పి మిగతా ముగ్గురికి చూయిస్తున్నాడు.

కాకులు దూరం కారడవి కాదు, చీమలు దూరని చిట్టడవి కాదూ, పట్టణానికి కూతవేటు దూరంలో వున్నదా ప్రదేశం. చిన్న చిన్న గుబురులు, పొదల మధ్యన శాఖోపశాఖలుగా విస్తరిల్లి సమున్నతంగా ఎదిగిన చెట్టు ఆ ప్రాంతపు శోభకు గొడుగు పట్టింది. బలిష్ఠులైన మహాకాయులు గుట్టలనుండి తెచ్చి పేర్చినారా! అన్నట్లు అక్కడక్కడ పోగుపడి వున్న పెద్ద పెద్ద గుండ్లు ఆ ప్రాంతానికి మరింత రమణీయతను కూర్చినవి. సరిగ్గా పర్వు దూరంలో నున్న "నదీ" సంగమం కొరకు కాబోలు పరవళ్ళు తొక్కుతూ పారుతున్న ఒక నీటిపాయ ఆ ప్రాంతాన్ని రెండుగా చీల్చిందా అనిపిస్తుంది. ఆ పాయకు అటు ఇటుగా ఏపుగా పెరిగిన పచ్చని గడ్డి, రకరకాల మొక్కలు, చెట్లతో అలరారుతున్న ఆ ప్రదేశానికి గొడుగు పట్టినట్లున్న ఆ మేలెత్తు చెట్టులో ఒక్కింత గర్వం తొణికిసలాడేది. అందుకు కారణం లేకపోలేదు. తూర్పు నుండి పడమటికి పరుగులెత్తె సూర్యుడు ఆ చెట్టు మిడిసిపాటుకు కారణమేమిటా? అనుకుంటూనే పడమటి కనుమల్లోకి జారిపోతాడు.

జగత్తులో సర్వప్రాణులు తమ తమ నెలవులకు మళ్ళె సమయం. సరిగ్గా అదే సమయంలో ఆ ప్రాంతానికి సరికొత్త శోభ సమకూరుతుంది. ఒకటికాదు, వందకాదు. క్షణాల్లో మబ్బులు కమ్మి వర్షిస్తున్నట్లు వేలకు వేలుగా పక్షులు ఆ మేలెత్తు చెట్టుపై వాలిపోతాయి. పిడికిలిలో ఇమిడిపోయే పిట్టలు మొదలు కాకులు, కొంగలు, చిలకలు, నెమళ్ళు, పాలపిట్టలు, పావురాళ్ళు, అరిసెపిట్టలు, గువ్వలు, గోరింకలు అంటూ పేర్లు చెప్పుకుంటూ పోతే నోరు చాలదేమో అనిపించేంతగా పక్షిజాతి ప్రపంచం ఆ చెట్టుపై కొలువు దీరిందా! అనిపిస్తుంది. పొద్దు గుంకిన సమయంలో పక్షులు చేసే సవ్వడి అదో సంగీత ప్రపంచం. ఒక్క పిట్ట లెక్క తప్పి వేరే గుంపులో వాలినా పెద్ద కలకలమే రేగేది. ఆతురతలో కాదుబడిన ఆ పిట్ట సజాతి గుంపులో కలిస్తేనే గాని ఆ కలకలం సద్దుమణిగేది కాదు. ఏ జాతి పక్షుల గుంపులు ఆయా కొమ్మల్లో ఇమిడిపోయేవి. పక్షులు వచ్చే సమయానికి తన ఆకులను ముడుచుకొని మరింత స్థలాన్ని సమకూర్చేది చెట్టు. పైన పక్షి జాతులకు మల్లే చెట్టు కింద **జంతు సమూహాలు** కూడా తమ నెలవులను ఏర్పరచుకున్నాయి. పట్టణం కుగ్రామంగా ఉన్నప్పుడు ఆ చెట్టుకింద పులులు, సింహాలు వంటి క్రూరమృగాలు కూడా సేదదీరేవట. గ్రామం పెరిగి పట్టణంగా పరిణామం చెందే క్రమంలో పెరిగిన మానవ సంచారంతో క్రూరమృగములు మాయమైపోయిన, సాధుజంతు సమూహములు, పక్షిజాలము మరింతగా ఆ చెట్టును నెలవు చేసుకున్నాయి. అందుకు దప్పిక తీర్చే ఆ నీటిపాయ కూడా కారణం కావచ్చు. తమ చిన్ని పొట్టను నింపుకోవడానికి పగలంతా ఎక్కడెక్కడో ఎగిరెగిరి తిరిగి తమ రెక్కల అదిరింపుతో అలసిసొలసిన పక్షి సమూహాలు ఒక్కింత తొందరగానే నిద్రలోకి జారుకున్నాయి. పక్షుల సవ్వడి సద్దుమణిగాక చెట్టు కూడా జోముగా నిద్ర పట్టింది. రోజువారి రివాజుగా ఆరోజు ముగిసింది.

తూరుపు ఏరులు బారకముందె పక్షుల కువకువలతో చెట్టు మేలుకుంది. కింద జంతువుల అలికిడి అప్పుడే మొదలయ్యింది. ఒక్కసారిగా పక్షులు ఎక్కడెక్కడ ఎగిరిపోవాలో మాట్లాడుకుంటున్నాయేమో, తమ సంతతిని బుజ్జగిస్తున్నాయేమో, మళ్ళీ కలకలకం మొదలయ్యింది. తమ పొట్ట నింపుకోవడానికి, తమ సంతతిని బతికించుకోవడానికి పక్షులు, జంతువులు సూర్యోదయం కాకముందే చెట్టుకు వీడ్కోలు పలికినాయి. తమ తల్లిని వీడలేక వీడినట్లు వెళ్ళుతున్న పక్షులను చూసిన చెట్టు, తన పిల్లలు ఇంకాసేపు విశ్రమిస్తే బాగుండేదని అనుకొనేది చెట్టు. ఒకప్పుడు తన సమీపంలోనే తగినంత మేత దొరికేది. నీటిపాయలో నీరు తాగి మధ్యాహ్నంవేళ తనను చేరుకొని విశ్రమించేవి. పట్టణం, నగరంగా, నగరం మహానగరంగా మారుతున్న క్రమంలో పంటపొలాలు ప్లాట్లుగా మారుతున్నాయి. కొండచిలువల్ల సాగుతున్న రోడ్లు కాలనీల నేర్పరచటంతో, చుట్టూరా ఎక్కడా దాన్యం దొరకక పక్షులు దూరంగా వలసబోతున్నవి. ప్రాణి ప్రపంచం దాహం తీర్చే నీటిపాయ వానాకాలం నుండి వానా కాలం దాక పక్షుల దాహం తీర్చటంలో కనాకష్టంగా మారింది. రాను రాను వానలు కొడిగట్టటం మూలానేనేమో, ఈ నగరం ఇట్లా పెరుగుతుండటం ఏమోగాని పాయలో చారెడు నీటికోసం వెదికినా కానరాని పరిస్థితి దాపురించింది. చెట్టుకింద ఆవాసాలు ఏర్పరచుకున్న జంతు సమూహాలు (మానవ సంచారం వల్ల కాబోలు) మాయమై నాయి. పక్షులు మాత్రం పొద్దుగుంకె సమయానికి తమ నెలవుకు చేరుకుంటున్నాయి. సుదూర ప్రాంతాల కెళ్ళి వచ్చే పక్షులు రానున్న గడ్డు రోజుల్లో తననెక్కడ ఎడబాస్తాయోనని దిగులు చెందసాగింది చెట్టు. పాతాళంలోని నీటినైనా అందిపుచ్చుకొని పచ్చగా ఉంటాను. ఎంత ఎండలనైనా తట్టుకొని ప్రాణులకు నీడనిస్తాను. కాని భూమిపై కొడిగడుతున్న నీటినిల్వల గురించే చెట్టు బెంగ. అప్పటికే ఆ ప్రదేశంలో చాల మార్పు వచ్చింది. గతంలో ఉన్నంత పచ్చదనం ఇప్పుడు లేదు. అయినా అప్పుడే ముంచుకువచ్చిందేమి లేదులే అని తమాయించుకుంది. పక్షులు తనను వదలనంత కాలం తన శోభకు, సంతోషానికి ఏమీ తరుగు లేదని సంతృప్తి చెందింది.

ఒకరోజు చెట్టుకింద నాలుగు అధునాతనమైన కార్లు ఆగాయి. అందులో సూటుబూటులతో దిగిన మనుషులను చూసి ఒక్కసారిగా అదిరిపోయింది చెట్టు. ఏదో ఆపద రానున్నదని మధనపడసాగింది. అనుకున్నట్టుగానే అందులో ఒకడు తన చేతిలో చుట్టబడి ఉన్న కాగితాన్ని మడతవిప్పి మిగతా ముగ్గురికి చూయిస్తున్నాడు. ఆ కాగితాన్ని పట్టుకొని ఆప్రాంతం నలుమూలలు తిరుగుతున్నారు. రకరకాలుగా కొలతలు వేశారు. అంజనం లాంటి అద్దాలతో చుట్టూ పరికించారు. ఈ చోద్యం అంతా చెట్టుకు అర్థంకాలేదు గాని భయం మాత్రం పట్టుకుంది. నిన్నటికి నిన్ననే తన చుట్టూ వున్న పొదలను, దుబ్బులను తొలగించారు. చిన్నవిగా పెద్దవిగా వున్న చెట్లను నరికారు. పొద్దుగుంకె సమయానికి వచ్చే పక్షులకిదేమీ పట్టకున్నా, వస్తున్న మార్పులను కొన్ని పక్షి జాతులు గమనిస్తున్నాయి. కొన్ని రకాల పక్షులు ముందుకు మల్లే రావటంలేదు. పూర్వంలా వున్న నిండుతనం ఇప్పుడులేదు. ఏదో కొంత వెలితిగా వున్నా సమాధానపడుతూ వస్తున్నది చెట్టు. మరుసటి రోజే ఒక పెద్ద యంత్రం చెట్టు సమీ పంలోని నీటిపాయ గట్టుకు ఆనుకొని ఆగింది. కొద్దిసేపట్లోనే పెద్ద రొద మొదలయ్యింది. ఎంతో ఆహ్లాదకరమైన పక్షుల కువకువలు విన్న ఆ చెట్టు ఆ రొదను భరించలేక తల్లడిల్లింది. నీటిపాయ గొంతులో గునపాన్ని దించినట్లు ఇన్నాళ్ళు మింగిన నీటిని లోలోతుల నుండి కక్కించినట్లు నీటిపాయలో నుండి నీళ్ళ గొట్టం ద్వారా పైకి తీయటం చూసిన చెట్టు మనసు కకావికలమయ్యింది. అలా ఉబికి వచ్చిన నీటిని పెద్ద బాణాలాంటి టాంకులలో నింపినారు. అక్కడక్కడయినా దోసెడు నీళ్ళు ఉబికే చెలిమలతో వుండే నీటిపాయ ఒట్టుపోయింది. మనుషులు నిర్మించిన టాంకులలోని నీటి నిల్వలను చూసి పక్షుల దాహార్తి తీరుతుందిలే అని అంత విశాదంలోను కొంత సమాధానపడింది చెట్టు.

మరో నాలుగు రోజులు గడిచాయి. కారు వచ్చి చెట్టుకింద ఆగింది. దాని వెంటనే లారీ వచ్చింది ఆ లారీలో జనం వచ్చారు. వచ్చిన జనం లారీల్లో నుండి గొడ్డళ్ళు, రంపాలు దించుతున్నారు. కారులో దిగినవాడు చెబుతున్నాడు పని మొదలెట్టండి, పట్టుమని పదిరోజుల్లో పనిపూర్తి చేయాలి. ఇదంతా క్లీన్ అయిపోవాలి అంటున్నాడు. ఇదంతా చూస్తున్న చెట్టు జరగబోతున్నది ఊహించినట్లుందేమో తనకేమయినా గాని, తన నాశ్రయించి, తననే నెలవుగా భావించి బతుకుతున్న అనేక పక్షులను, ప్రాణులను తలచుకొని శోకసముద్రమయ్యింది చెట్టు. రోజు రోజుకు మారుతున్న పరిస్థితులను పక్షులు గమనిస్తున్నాయి. తమకు నెలవైన చెట్టు శోభ నానాటికి కునారిల్లిపోతున్న పరిస్థితి వాటిని బాధిస్తున్నది. తమ నిస్సహాయతకు వేదన చెందుతున్నాయి. చెట్టుకు ధైర్యం చెప్పేంత స్థైర్యం తమకు లేనందుకు చింతి స్తున్నాయి. అయినా రోజులు గడుస్తున్నాయి. ఆరోజు రానే వచ్చింది. పని పట్టుకున్నవాడు తొందర పెట్టెడేమో రాత్రంతా పనిచేస్తున్నారు. ఎక్కడ తన పిల్లలకు నిద్రాభంగం కలుగుతుందోనని, గొడ్డళ్ళ వేట్లను, అంపపుకోతను మౌనంగా భరిస్తున్నది చెట్టు. -అయిన ఆ రొదకు పక్షులు కూడ కలవరపడుతున్నాయి. వారం రోజుల నుండి అంతంతగా నిద్రిస్తున్న పక్షులకు ఆరోజు నిద్రపట్టలేదు. కునికిపాట్లు పడుతూ ఎప్పుడు తెల్లారుతుందా అని ఎదురుచూస్తున్నాయి. కలవరింతలకు గురైనాయి. ఉలిక్కిపడుతున్నాయి. తమ కాళ్ళకింది నేల కంపించినట్లయ్యింది. అంతలోనే పెళపెళార్భాటంతో ఆరోజు తెల్లారింది. పక్షులన్ని ఒక్కసారిగా పైకి లేచాయి. వాటి కలకలం పెద్దగందరగోళాన్నే రేపింది. ఏం జరిగిందో తెలిసే లోపలే మేలెత్తు చెట్టు సమూలంగా నేలకొరిగింది. ఆ సంఘటనలో ఎన్నో పక్షులు విగతజీవులయ్యాయి. కృత్రిమ నీటి కొలనుల్లో పడి మరెన్నో పక్షులు ప్రాణాలొదిలాయి. మిగిలిన వేలాది పక్షులు, మరెన్నో ప్రాణులు నెలవు దప్పి విలవిలలాడి ఎటో ఎగిరిపోయాయి. నేల కొరిగిన చెట్టు మానవ తప్పిదానికి చివరి కన్నీటి బొట్టు విడిచింది. ఆరోజు బారెడు పైకెక్కిన సూర్యుడికి మేలెత్తు చెట్టు కనిపించలేదు. తన కిరణాలను లేత ఆకుల్లో పచ్చని కాంతుల్లో ప్రతిబింబించే చెట్టు నేలకొరిగిందని తెలియగానే ఎందుకు ఉదయించానా? అని కలవరపడుతూ పడమటి కనుమల వైపు సాగిపోయాడు.

ఇప్పుడు ఆ ప్రాంతంలో మేలెత్తు చెట్టు లేదు. దాని చుట్టు ఉన్న శోభాయమానమైన పచ్చదనం లేదు. పక్షులు లేవు. పేర్చినట్లున్న పెద్దపెద్ద రాతిబండలు లేవు. అక్టోపసిలా అష్ట దిక్కులకు విస్తరించిన నగరం ఆ ప్రాంతాన్ని కూడా ఆబగా మింగేసింది. ప్రహరిగోడ ఆ ప్రాంతాన్నంత చుట్టేసి తనలో ఇముడ్చుకుంది. లోపల అద్దాల్లాంటి రోడ్లు, ఎన్నో భవనాలు నిర్మాణం అయ్యాయి. సకల సౌకర్యాలు కల్పించారు. కబంద రాక్షసుడు హస్తాల్లాగా చుట్టూ ఉన్న ప్రహరికి విశాలమైన గేటు దగ్గర మేలెత్తైన బోర్డు. దానిపై ఇలా రాసి ఉంది "అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ మరియు పరిశోధనా కేంద్రం" అచ్చంగా ఇప్పుడది చీమలు దూరని చిట్టడవి, కాకులు దూరని కారడవి.

వారం రోజుల నుండి అంతంతగా నిద్రిస్తున్న పక్షులకు ఆరోజు నిద్రపట్టలేదు. కునికిపాట్లు పడుతూ ఎప్పుడు తెల్లారుతుందా అని ఎదురుచూస్తున్నాయి. కలవరింతలకు గురైనాయి. ఉలిక్కిపడుతున్నాయి. తమ కాళ్ళకింది నేల కంపించినట్లయ్యింది. అంతలోనే పెళపెళార్భాటంతో ఆరోజు తెల్లారింది. పక్షులన్ని ఒక్కసారిగా పైకి లేచాయి. వాటి కలకలం పెద్దగందరగోళాన్నే రేపింది. ఏం జరిగిందో తెలిసే లోపలే మేలెత్తు చెట్టు సమూలంగా నేలకొరిగింది.

చాక్‌లెట్

రాము: అమ్మా! నాకు ఫైవ్‌స్టార్ చాక్‌లెట్ కొని ఇస్తావా? లేదా?

తల్లి: ఇప్పుడేమీ కొనను. నన్ను విసిగించకు. ఇంకో గంటసేపు ఏమీ మాట్లాడకుండా కూర్చో. మన ఊరు వచ్చేస్తుంది. దిగిపోదాం.

రాము: సరే ఇప్పుడేమీ మాట్లాడను. టిసి వచ్చినప్పుడే మాట్లాడతాను.

తల్లి: ఏం మాట్లాడతావు.

రాము: నా వయసు ఎంతో చెబుతానంతే!